క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం భేష్



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఫుడ్ క్వాలిటీ కంట్రోలర్ ఖాసీంవలీ

డోన్ టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం భేష్‌గా ఉందని ఫుడ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ఖాసీంవలి అన్నారు. బుధవారం పట్టణంలోని 13,14 అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆహారంతో పాటు రికార్డులను పరిశీలించారు. అన్నం, పప్పు, ఆకు కూరలు, కొడిగుడ్ల రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురు పిల్లలతో మాట్లాడి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ పరమేశ్వరమ్మ, టీచర్లు మల్లిక, సుమలత పాల్గొన్నారు.

4న పట్టుబడిన వాహనాల వేలం

కోవెలకుంట్ల: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 4వ తేదీన వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు రూ. 3వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్, పాన్‌కార్డు వివరాలు అందజేయాలని సూచించారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

బనగానపల్లెరూరల్: సాగు చేసిన పంటలను రైతులు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అప్పలాపురం, సంకాలపురం గ్రామంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదుతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలన్న, పంట నష్టపరిహారం చెల్లించాలన్న ఈ క్రాప్ లో నమోదై ఉండాలన్నారు.

నూతన డైరీ ఆవిష్కరణ

బనగానపల్లె: స్థానిక పశుసంవర్ధకశాఖలో విధులు నిర్వహిస్తున్న నాన్‌గ్రాడ్యుయేట్ వెటర్నేరీయన్స్ నూతన డైరీ, క్యాలెండర్లను ఏడీఏ డాక్టర్ మారుతీ సకారామ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, పారావెటర్నరీ సిబ్బంది ముఖహాజరు నుంచి తమకు మినహాయింపు ఇచ్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బనగానపల్లె, అవుకు మండలాల వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి

డోన్ టౌన్: గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పిలుపునిచ్చారు. భీష్మ ఏకాదశి పర్వ దినాన్ని పురష్కరించుకుని పట్టణంలో బుధవారం గంగపుత్రులు ర్యాలీ నిర్వహించారు. సమీపంలోని కొట్లవారిపల్లెలో ఉన్న గంగమ్మ గుడిలో గంగపుత్రులతో కలిసి చైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కలిప్పించారన్నారు. గంగపుత్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. త్వరలో గంగమ్మ నూతన గుడి నిర్మాణాన్ని సభ్యుల సహకారంతో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గంగపుత్రుల సంక్షేమ సంఘం సభ్యులు గంప వెంకటేశ్వర్లు, చంద్రుడు, మల్లికార్జున, సోమయ్య, ప్రవీణ్, కృష్ణమూర్తి, సురేష్, మురళీ, రవితదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టడీ టూర్ విజయవంతం



మున్సిపల్ చైర్మన్‌ను సత్కరిస్తున్న అధికారులు, కౌన్సిలర్లు

డోన్:ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల సమష్టి సహకారంతో విశాఖపట్నం అభివృద్ధి పథంలో దేశంలోనే నాల్గవ స్థానంలో ఉందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. గత వారం రోజుల పాటు 32 మంది కౌన్సిలర్లు, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులతో కలిసి విశాఖపట్నం నగర పాలక సంస్థలో నిర్వహించిన స్టడీ టూర్ విజయవంతమైన సందర్భంగా స్థానిక కార్యాలయంలో బుధవారం చైర్మన్‌ను కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో క్లీన్ అండ్ గ్రీన్, 24 గంటల పాటు మంచి నీటి సరఫరా తమను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. డోన్ మున్సిపాలిటీని కూడా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే సీఎం లక్ష్యం

- పాలనా రాజధానిగా విశాఖను స్వాగతిస్తున్నాం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి ప్రజల మద్దతు
- మున్సిపల్ చైర్మన్ రాజేష్, పాలకవర్గ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు స్పష్టం చేశారు. పరిపాలన రాజధానిగా విశాఖపట్నం ఉంటుందని ఢిల్లీలో సీఎం చేసిన ప్రకటనను తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో పాటు కౌన్సిలర్లు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల సమానాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంకితభావంతో కృషి చేస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో ఇప్పటికే అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న విశాఖపట్నాన్ని రాష్ట్ర పరిపాలన రాజధానిగా చేయడం అన్నివిధాలుగా న్యాయమన్నారు. అమరావతిలో వేల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి పాలనారాజదాని కోసం నూతన భవనాలు నిర్మించడం సబబు కాదన్నారు. ఇప్పటికే శాసన రాజధానిగా అమరావతిని ప్రభుత్వం గుర్తించిన విషయాన్ని మున్సిపల్ చైర్మన్ రాజేష్ గుర్తు చేశారు. దేశంలోని ప్రముఖ పట్టణాలైన ఢిల్లీ, చెన్నై, కలకత్తా, భువనేశ్వర్, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు రోడ్డు, రైల్వే, విమానశ్రాయాల కనెక్టివిటీ విశాఖపట్నానికి ఉందన్నారు. ఎంతో వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతాలైన విజయనగరం, శ్రీకాకుళం పరిపాలన రాజధానితో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. రాయలసీమకు సంహద్వారమైన కర్నూలుల్లో న్యాయ రాజధాని, గుంటూరు, విజయవాడ మధ్య శాసన రాజధాని విశాఖపట్నంలో పాలన రాజధాని ఏర్పాటును అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతూ ముక్తకంఠంతో ఆమోదిస్తున్నారని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, ఆర్ట్ రమణ, గోల్ల వెంకట్రాముడు, మహేశ్వరరెడ్డి, బోయ సుమలత సురేష్, ధారా హరి, కటికె వేణు, కురుకుంద హరి, కుల్లాయ్, వెంకటేశ్వరమ్మ, రైల్వే నాగేంద్ర, సుంకన్న, బద్దల సుబ్బలక్ష్మి, బోయ కళావతి, మేకల విమల, సుకన్య, ఇంతియాజ్, షాధిక్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుర్రు శ్రీధర్, మేకల రాజు, వడ్డే రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్ భూములను పరిశీలించిన ఆర్డీఓ



రామాపురంలో భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

అవుకు: మండల పరిధిలోని రామాపురంలో ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల భూములను బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి ఆర్డీఓ వెంకటరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రామాపురానికి సంబంధించి ల్యాండ్ కన్వర్షన్ కొరకు ఆరు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మారం వేణుగోపాల్ రెడ్డికి చెందిన సర్వేనంబర్ 434లో యాభైసెంట్లు, షేక్ రసూల్‌కు చెందిన 273/ఏలో 1.19 ఎకరా, 274/బిలో 1.32 ఎకరా, ఆకుల శివలక్ష్మమ్మకు చెందిన 108/బిలో ఎకరా భూములను పరిశీలించామని చెప్పారు. అలాగే చెక్క ఉమామహేశ్వరి స్థానికంగా లేనందున పెండింగ్‌లో ఉంచామన్నారు. మరో అర్జీదారుడు బొబ్బల ప్రతాప్ రెడ్డి 107/ఏలో ఎకరాకు ల్యాండ్ కన్వర్షన్ కొరకు దరఖాస్తు చేసుకోగా ఆన్‌లైన్‌లో పేరువేరు ఉన్నందున రిజెక్ట్ చేశామని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంగల్ రెడ్డి, మండల సర్వేయర్ స్వరూప, విలేజ్ సర్వేయర్ మనోజ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్‌లో నిబంధనలు పాటించాలి

బనగానపల్లెరూరల్: వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేయు విషయంలో రెవెన్యూ సిబ్బంది నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పొదుపు భవనంలో అవుకు, బనగానపల్లె, కోవెలకుంట్ల మండలాల రెవెన్యూ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉన్న వ్యవసాయేతర భూములు, లే అవుట్లను పరిశీలించాలన్నారు. అలాగే ల్యాండ్ కన్వర్షన్ కోసం యాజమానులు పెట్టుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కారించాలని తహసీల్దార్లకు సూచించారు. అనంతరం బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల తహసీల్దార్లు బచ్చు శ్రీనివాసులు, పుష్ప కుమారి ల్యాండ్ కన్వర్షన్‌లో పాటించాల్సిన నిబంధనలపై రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



భీష్మాచార్యుల చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు

బేతంచెర్ల : మండలంలో భీష్మ ఏకాదశి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తెలుగు రంగయ్య స్వగృహంలో మండల గంగపుత్రుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తెలుగు వెంకటరమణ, యల్లయ్య తదితరులు భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మిస్పా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు గంగన్న, మద్దిలేటి, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, రాముడు, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సంపూర్ణ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. భీష్మ ఏకాదశి పర్వ దినాన్ని పురష్కరించుకొని అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీగోదాదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త పాతాళం సుబ్బారావు,సభ్యులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి
- పోలీసు స్టేషన్ ఎదుట గిరిజన సమాఖ్య నాయకుల ధర్నా



పోలీసు స్టేషన్ ఎదురుగా ధర్నా చేస్తున్న గిరిజన సమాఖ్య ఐక్యపోరాట సమితి నాయకులు

బనగానపల్లె: ఎస్‌ఐ శంకర్‌నాయక్ సస్పెన్షన్ ఎత్తివేయాలని, టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏపీ గిరిజన సమాఖ్య ఐక్యపోరాట సమితి నాయకులు ధర్నా చేశారు. అనంతరం డీఎస్పీ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, గిరిజన సంఘాల నాయకులు ఈశ్వర్‌నాయక్, రవీంద్రనాయక్ మాట్లాడారు. చిన్నరాజుపాలెంకు చెందిన యువకుడు కుమ్మరి దస్తగిరి మృతి కేసులో ఎలాంటి ఆధారాలు చూపకుండా క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండా కేవలం టీడీపీ నాయకుల ఆరోపణల మేరకు ఎస్‌ఐపై కేసు పెట్టడమే కాకుండా సస్పెన్షన్ చేయడం దారుణమన్నారు. అప్పు విషయం సంఘటనలో దస్తగిరి మృతి చెందడం విచారకరమని, అయితే తెరవెనుక కడప జిల్లా కమలాపురం ఎస్‌ఐ చిన్న పెద్దయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. రాజకీయ స్వార్థం కోసం కుట్రలుపన్నీ దస్తగిరి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేలా ఫోన్‌లో రెచ్చగొట్టి మృతికి కారకులయ్యారన్నారు. ఎస్‌ఐ చిన్న పెద్దయ్య కాల్ డేటాను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, మాజీ ఎమ్మెల్యే బీసీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు రవినాయక్, బాలునాయక్, కె శంకర్‌నాయక్, శివశంకర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి శ్రీనివాస నాయక్, జీవీఎస్ విద్యార్థి విభాగం నాయకులు రవీంద్ర నాయక్, నాగేష్ నాయక్, రామకొట్టినాయక్, వెంకటేష్‌నాయక్, సుధాకర్‌నాయక్, జీవీఎస్ ఉపాధ్యక్షుడు మల్లేష్‌నాయక్, ఎస్టీసెల్ లీలానాయక్, అశోక్ నాయక్, సురేష్‌నాయక్, శేఖర్ నాయక్, మద్దిలేటి నాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు విద్యలో రాణించాలి

డోన్ టౌన్: బాలికలు విద్యలో రాణించాలని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్సీసీ శాంతి అన్నారు. పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు క్లబ్ సభ్యురాలు ముడియాల శైలజారెడ్డి ఆర్థిక సాయంతో ఐఐటీ పౌండేషన్ కోర్సుకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా బాలికలకు సమాజంలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిస్కార మార్గాలు తదిరత అంశాలను సాయినాథ్ వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగ జాస్మిన్, క్లబ్ సభ్యులు సరళ, సుధ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

బనగానపల్లెరూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేటకు చెందిన వివాహిత ఎస్ షమీమ్(32) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఓబులేసు భార్య షమీమ్‌కు కొన్నేళ్లుగా కడుపు నొప్పితో పాటు రెండు కాళ్లు సచ్చుపడి ఇంట్లోనే ఉంటుంది. ఓబులేసు పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి కి 9, 6వ తరగతి చదువుతున్న కుమారులు పవన్‌కుమార్, ప్రశాంత్‌కుమార్ ఉన్నారు. అనారోగ్యంతో మనస్థాపానికి గురైన షమీమ్ భర్త, పిల్లలు లేనిసమ యంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటిచుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రక్షణ కల్పించండి

డోన్ రూరల్ : అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న వంటీర్లకు రక్షణ కల్పించాలని తిమ్మాపురం గ్రామ వలంటీర్లు జింకల రమేష్, ఆశోక్, మధు పోలీసులను కోరారు. పట్టణంలోని గెస్ట్ హౌస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత నెలలో తిమ్మాపురం గ్రామానికి చెందిన వంజ హరిచంద్రుడు నాటు సారాను తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి సారా బట్టీని ధ్వంసం చేశారన్నారు. అయితే ఈ సమాచారం ఇచ్చాడని వలంటీర్ జింకల రమేష్‌పై వంజ హరిచంద్రుడు, కుటుంబ సభ్యులు దాడిచేయడంతోపాటు ఇంటి తలుపును ధ్వంసం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తనను చంపుతామని బెదరింపులకు పాల్పడుతున్నారని, రక్షణ కల్పించాలని బాధిత వలంటీర్ పోలీసులను కోరారు.

పశుగ్రాసం దగ్ధం

బనగానపల్లెరూరల్: మండలంలోని పెద్ద రాజుపాళెం గ్రామానికి చెందిన రైతు బోయ రాముడికు చెందిన పశు గ్రాసం బుధవారం తెల్లవారుజామున దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు పశువుల మేత కోసం రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి గ్రామ సమీపంలోని కళ్లంలో నిల్వ ఉంచానన్నారు. గిట్టనివారు పశుగ్రాసాన్నికి నిప్పు పెట్టడడంతో మంటలు వ్యాపించాయని, గమనించి ఇతర గడ్డివాములకు వ్యాపించకుండా ఆర్పేశామన్నారు. గతంలోనూ తన పశుగ్రామాన్ని దుండులు నిప్పంటించిన విషయాన్ని బాధిత రాముడు గుర్తు చేశారు. సుమారు రూ.40వేల నష్టం వాటిల్లిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, మండల నాయకులు బాబుల్ రెడ్డి తెలిపారు. మండలంలోని గోర్లగుట్ట గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ మాదక్క, సచివాలయ పంచాయతీ కార్యదర్శి శ్రీలత, సిబ్బందితో కలిసి ఎంపీపీ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం మూడున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీకృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖరయ్య, తిరుమలేశ్వర్‌రెడ్డి, నాగ వెంకటేశ్వర్లు, ఎద్దులన్న, రామసుబ్బయ్య, మద్దిలేటి, భాస్కర్ పుల్లయ్య, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వెంకిరెడ్డి, చలపతి రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, సుధాకరప్ప, అరిగెల శేఖర్ పాల్గొన్నారు.

శివాలయంలోకి తొలి సూర్యకిరణాలు



శ్రీ రామేశ్వరస్వామిపై తొలి సూర్యకిరణాలు ప్రసరించిన దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరులో వెలిసిన శ్రీ రామేశ్వరస్వామి ఆలయంలో కొలువైన స్వామివారిని బుధవారం ఉదయం తొలి సూర్యకిరణాలు తాకాయి. దీంతో ఆలయ అర్చకులు భాస్కరయ్య ఆధ్వర్యంలో స్వామివారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాఘమాసం సప్తమి రోజున ఇలా జరగేదని, ఈ ఏడాది భీష్మ ఏకదాశిరోజు సూర్యకిరణాలు స్వామివారిని తాకాయని చెప్పారు. ఈ కిరాణాలు ఉదయం 7.20 గంటల నుంచి 7.35 గంటల వరకు స్వామివారి పై ప్రసరించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

ఉపాధి నిధుల్లో కోత అన్యాయం

కోవెలకుంట్ల: కేంద్ర బడ్జెట్‌లో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధుల్లో కోత విధించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధి పథకానికి నిధులు తగ్గించడం కూలీల కడుపుకొట్టడమేనన్నారు. గత ఏడాది బడ్జెట్‌లో ఉపాధి పథకానికి 89 వేల కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ. 60 వేల కోట్లకు కుదించడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమేష్, రియాజ్ పాల్గొన్నారు. అలాగే ఆహారభద్రకు కేటాయించే నిధుల్లోనూ భారీగా కోత విధించారని ఆందోళన వ్యక్తం చేశారు.

81 శాతం పింఛన్ పంపిణీ



వృద్ధులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్



నెరవాడకు వెళ్లి పింఛన్ అందజేస్తున్న బాలాజీ నాయక్



కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్

కోవెలకుంట్ల: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పథకం ద్వారా లబ్ధిదాలకు ఫిబ్రవరి నెల పింఛన్లు ఠంచన్‌గా అందాయి. కోవెలకుంట్ల, సంజామల మండలాల్లోని గ్రామాల్లో బుధవారం తెల్లారక ముందే పింఛన్ల పంపిణీ కొనసాగింది. కోవెలకుంట్ల మండలంలోని 17 గ్రామ పంచాయితీల్లోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెలకు సంబంధించి 5,920 వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, తదితర పింఛన్లు ఉన్నాయి. తొలిరోజున ఆయా గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి 4,850మందికి అందజేసి 81శాతం సాధించినట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా పేర్కొన్నారు. అలాగే సంజామల మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 5,181 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా తొలిరోజు 80 శాతం మందికి అందజేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో 12,395 పింఛన్ల ఉండగా బుధవారం ఒక్కరోజే 11056 (89.2 శాతం) మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. వలంటీర్లు తెల్లవారకముందే లబ్ధిదారుల ఇంటి ముగింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేస్తుండడంతో వృద్ధులు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొలిమిగుండ్ల: కోడి కూయక ముందే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల తలుపు తట్టి ఫింఛన్ సొమ్ము అందిస్తుండటంతో అవ్వాతాతల్లో ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయి. బుధవారం తెల్లవారు జాము నుంచే వలంటీర్లు పింఛన్‌లు పంపిణీ చేపట్టారు. మండలంలో 7009 పింఛన్‌లు ఉండగా మొదటి రోజు 5334 మందికి పంపిణీ చేయడంతో 76 శాతం పూర్తయ్యాయి. ఎంపీడీఓ సుబ్బరాజు అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, బందార్లపల్లె గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీని పరిశీలించారు.

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఫిబ్రవరి నెలకు సంబంధించి పింఛన్లను బుధవారం ఉదయం నుంచి వలంటీర్లు పంపిణీ ప్రారంభించారు. మండలపరిధిలోని బుగ్గానిపల్లె తండాకు చెందిన మాల్యా లక్ష్మిబాయి పక్షవాతంతో మంచాన పడ్డారు. పాణ్యం మండలం నెరవాడ గ్రామంలో తన పెద్ద కొడుకు దగ్గర ఉండటంతో విషయం తెలుసుకున్న వలంటీర్ బాలజీ నాయక్ అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు. బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన సలీమ అనే వృద్ధురాలు కాలు విరిగి అంబాపురం గ్రామంలో ఉండటంతో వలంటీర్ అక్కడకు వెళ్లి పింఛన్ అందజేసింది. అలాగే జెండాపేటకు చెందిన వృద్ధుడు కర్నూలులో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశాడు.

డోన్ రూరల్ : మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేశారు. మండల పరిధిలోని కన్నపకుంటకు చెందిన పింఛన్‌దారుడు నారాయణరెడ్డి అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ మేరకు వలంటరీ భూలక్ష్మి అక్కడికి వెళ్లి నగదు అందజేశారు.